క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: హనుమకొండ, కాజీపేట, మడికొండ ప్రాంతాల్లో ఈనెల 10న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. విద్యుత్ సబ్‌స్టేషన్లలో మరమ్మతులు చేస్తున్నందున ఆయా సబ్‌స్టేషన్ల పరిధిలో దశల వారీగా ఉదయం 7.30 నుంచి 11గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఈబీఎస్‌బీ ఎన్‌సీసీ క్యాంపునకు పింగిళి కళాశాల కేడెట్లు



హన్మకొండ అర్బన్: ఈనెల 10నుంచి పంజాబ్‌లోని మాలేరు కోట్లలో జరగనున్న ఏక్ భారత్.. శ్రేష్ట భారత్ (ఈబీఎస్‌బీ) ఎన్‌సీసీ క్యాంపునకు నగరంలోని పింగిళి కళాశాలకు చెందిన ఇద్దరు మహిళా కేడెట్లు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ చంద్రమౌళి తెలిపారు. కళాశాలకు చెందిన కె.అవంతి పటేల్, ఎం.కీర్తిమాల ఎంపికైనట్లు వివరించారు. ఈ సందర్భంగా వారిని కళాశాల ఎన్‌సీసీ ఇన్‌చార్జ్ డాక్టర్ కల్పన, వైస్ ప్రిన్సిపాల్ సుహాసిని, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ రామకృష్ణారెడ్డి, అకడమిక్ కోఆర్డినేటర్ పార్వతి, అడిషనల్ కంట్రోలర్లు రేణుక, శిరీష, తదితరులు అభినందించారు.

సామాజిక న్యాయవేదిక జిల్లా కార్యవర్గం

ఎంజీఎం: సామాజిక కార్మిక న్యాయవేదిక వరంగల్ జిల్లా కమిటీని ఎంజీఎం ప్రాంతంలో శుక్రవారం జరిగిన కార్మికుల సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు యేశబోయిన సాంబయ్య సమక్షంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గొర్రె నాగరాజు, ప్రధాన కార్యదర్శిగా రాజారపు రాజేష్, ఉపాధ్యక్షుడిగా అర్సం లక్ష్మణ్, కార్యదర్శిగా హయగ్రీవాచారిని ఎన్నుకున్నారు.

దర్యాప్తులో పోలీసుల నిర్లక్ష్యం



నయీంనగర్: తన కొడుకు రాజేష్‌ను హత్య చేసిన నిందితులను పట్టుకోవడంలో పోలీసుల దర్యాప్తులో నిర్లక్ష్యం కనిపిస్తోందని హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం రంగయ్యపల్లి గ్రామానికి చెందిన బాధితుడు ఆషాడపు దశరథం ఆవేదన వ్యక్తం చేశారు. ఈమేరకు హత్య చేసిన వారికి అదుపులోకి తీసుకుని శిక్షించాలని కోరారు. హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తన కొడుకు రాజేష్‌ను 2018, మే 9న పెళ్లి ఊరేగింపులో అతని మిత్రులైన కొంతమంది నమ్మకద్రోహులు కూల్‌డ్రింక్స్‌లో విషం కలిపి హత్య చేశారని ఆరోపించారు.

'ప్రజా గర్జన'ను విజయవంతం చేయాలి



మడికొండ: ఈనెల 11న కొత్తగూడెంలో జరగనున్న ప్రజా గర్జనసభను విజయవంతం చేయాలని సీపీఐ నాయకులు కోరారు. ఈమేరకు ప్రజా గర్జన వాల్‌పోస్టర్లను 46వ డివిజన్ రాంపూర్‌లో శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పార్టీ కాజీపేట మండల కార్యదర్శి మునిగాల భిక్షపతి మాట్లాడుతూ ప్రజాగర్జన బహిరంగ సభకు ప్రతీ గ్రామం నుంచి కార్యకర్తలు, ప్రజలు భారీగా తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు బి.భిక్షపతి, రాంపూర్ గ్రామ కార్యదర్శి మంద సుమన్, మునిగాల ఐలయ్య, రజిత, స్వామి, ఉపేందర్, రాజుగౌడ్ పాల్గొన్నారు.

ప్రాణదాతలుగా నిలవాలి

హన్మకొండ అర్బన్: రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని రెడ్‌క్రాస్ చైర్మన్ రాష్ట్ర పాలకవర్గ సభ్యులు ఈవీ.శ్రీనివాస్‌రావు సూచించారు. నగరంలోని రెడ్‌క్రాస్ రక్తదాన కేంద్రంలో ఎస్‌జేపీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎండీ.నేహాల్ పుట్టినరోజును పురస్కరించుకొని సభ్యులు స్వచ్ఛందంగా శుక్రవారం రక్తదానం చేశారు. అనంతరం, రక్తదాతలకు శ్రీనివాస్‌రావు, కోశాధికారి బొమ్మినేని పాపిరెడ్డి, జిల్లా పాలకవర్గ సభ్యులు డాక్టర్ శేషుమాధవ్, ఎస్‌జేపీ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ వి.రాజ్‌కుమార్ సర్టిఫికెట్లు అందజేశారు.

ఏపీ లిప్సీ డ్రగ్స్ సీజ్

నయీంనగర్: హనుమకొండ లష్కర్ బజార్‌లోని అశ్విని హోమియోకేర్‌లో ఔషధ నియంత్రణ శాఖ అధికారులు శుక్రవారం దాడులు చేశారు. ఇందులో ఏపీ లిప్సీ అనే లేబుల్‌తో మందులు విక్రయిస్తున్నట్లు గుర్తించి డ్రగ్‌ను సీజ్ చేశారు. ఆస్పత్రిపై కేసు నమోదు చేశారు.

పీఆర్సీ కమిషన్ నియమించాలి

నయీంనగర్: రాష్ట్రంలో రెండవ పీఆర్సీ కమిషన్‌ను నియమించడానికి కేబినెట్ మంత్రివర్గం వెంటనే నిర్ణయం తీసుకోవాలని టీఎస్ టీఎన్జీవోస్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మహమ్మద్ ముజాహిద్ హుస్సేన్ కోరారు. సాధారణ బదిలీలను వెంటనే చేపట్టాలని, ఉద్యోగులకు ఇవ్వాల్సిన మూడు డీఏలను వెంటనే మంజూరు చేయాలని, డీసీటీఓలకు సీటీఓగా ప్రమోషన్ ఇవ్వాలన్నారు.

గొర్రెల ఎంపికలో చిత్రవిచిత్రాలు!

- కొమ్ములు మొలిస్తే పొట్టేలట
- వాహనాల్లో ఎక్కిస్తూ జీవాలను తప్పిస్తున్న దళారులు
- బక్కచిక్కిన, పాలు తాగే పిల్లలే లబ్ధిదారులకు దిక్కు
- సుదూర ప్రాంతాలకు వెళ్లి ఖాళీగా రాలేని పరిస్థితి
- అందుబాటులో ఉన్న వాటితో తిరుగు ప్రయాణం

హన్మకొండ : ప్రభుత్వం గొల్ల, కురుమలకు అందజేస్తున్న గొర్రెల ఎంపికలో చిత్రవిచిత్రాలు చోటుచేసుకుంటున్నాయి. జీవాలను ఎంపిక చేసి వాహనాల్లో తరలించే సమయానికి తప్పిపోతున్నాయి. దళారులు ఒకటి రెండు గొర్రెలను పక్కదారి పట్టిస్తుండడంతో లబ్ధిదారులకు నష్టం జరుగుతోంది. తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని శుక్రవారం రెండో విడత గొర్రెల పంపిణీని ప్రభుత్వం ప్రారంభించింది. హనుమకొండ జిల్లాలోని పరకాల నియోజకవర్గంలో 24 యూనిట్లు, వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో 24 యూనిట్లు పంపిణీ చేశారు. 20 ఆడ గొర్రెలు, ఒక పొట్టేలును యూనిట్‌గా ప్రతి లబ్ధిదారుడికి అందించాలి. జిల్లాకు చెందిన లబ్ధిదారులు ఈ నెల 5న ఆంధ్రప్రదేశ్‌లోని కడప, కర్నూలుకు వెళ్లి ఈనెల 8న సాయంత్రం వరకు



తిరిగి వచ్చారు. తమకు ఆరోగ్యంగా, బలంగా ఉన్న గొర్రెలను చూపించడం లేదని లబ్ధిదారులు తెలిపారు. బక్కచిక్కిన గొర్రెలు, పాలు తాగే పిల్లలను చూపిస్తూ తమ వద్ద అందుబాటులో ఉన్నవి ఇవేనని, ఇష్టముంటే తీసుకెళ్లండి, లేదంటే వదిలేయండి అంటున్నారని వారు వాపోయారు. దీంతో బక్కచిక్కిన, పాలు తాగే పిల్లలను తీసుకురావాల్సి వచ్చిందన్నారు. పాలుతాగే పిల్ల కూడా పెద్ద గొర్రె కింద లెక్క కడుతున్నారని తెలిపారు. పొట్టేళ్ల ఎంపికలోనూ మోసం, అన్యాయం చేస్తున్నారని, చిన్న మగ గొర్రెపిల్లను కూడా పొట్టేలు కింద పరిగణిస్తున్నారని, మగ గొర్రె పిల్లకు కొమ్ములు మొలిస్తే పొట్టేలు కింద లెక్కించి అంటగడుతున్నారన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈసారి గొర్రెల ఎంపికను పూర్తిగా లబ్ధిదారులకే ప్రభుత్వం వదిలేసింది. సుదూర ప్రాంతాలకు వెళ్లిన లబ్ధిదారులు అక్కడ గొర్రెల లభ్యత అనువుగా లేకపోవడంతో విధిలేని పరిస్థితుల్లో అందుబాటులో ఉన్న వాటినే తీసుకురావాల్సి వస్తోంది. ప్రయాణ సమయంలోనే చాలా గొర్రెలు చనిపోతున్నాయని, లారీల్లోకి గొర్రెలను ఎక్కించే క్రమంలో కొన్నింటిని తప్పిస్తున్నారని లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేశారు.

పొట్టేలును తప్పించారు..



నేను ఎంపిక చేసుకున్న గొర్రెలకు ఇన్సూరెన్స్ చేసి ట్యాగ్ వేశారు. వాటిని వాహనంలో ఎక్కించే సమయంలో కరెంట్ పోయింది. ఇదే అదునుగా దళారులు ఒక పొట్టేలును తప్పించారు. ఇక్కడికి వచ్చిన తర్వాత ఏ వాహనంలో చూసినా పొట్టేలు కనిపించలేదు.

\- కుంట యాదగిరి, న్యూశాయంపేట

పాలు తాగే పిల్లలు ఇచ్చారు



పెద్ద గొర్రెలు ఇవ్వకుండా పాలు తాగే గొర్రెలు ఇస్తూ వాటిని పెద్ద గొర్రెల కింద లెక్కిస్తున్నారు. 2 నెలల గొర్రె పిల్లను కూడా పెద్ద గొర్రె అని చూపిస్తున్నారు. గొర్రెల కోసం వెళ్లిన తమకు తాగడానికి కనీసం నీరు కూడా దొరకలేదు. భోజనం, వసతికి ఇబ్బంది పడ్డాం. ఆరోగ్యంగా, బలంగా ఉన్న గొర్రెలను అందించాలి.

\- జె.అనిల్, న్యూశాయంపేట

వారంలో 5రోజులు అందుబాటులో..



పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించిన చీఫ్ విప్

కాజీపేట: పట్టణంలోని ప్రజలకు వారంలో అయిదు రోజుల పాటు అందుబాటులో ఉండడానికి, సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించడానికి బీఆర్ఎస్ పార్టీ నూతన కార్యాలయాన్ని స్థానికంగా ప్రారంభించినట్లు వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే, చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్ తెలిపారు. కాజీపేట పట్టణంలోని డీమార్ట్ పక్కన ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్యతో కలిసి పార్టీ కార్యాలయాన్ని శుక్రవారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉదయం, సాయంత్రం వేళల్లో తప్పనిసరిగా మూడు గంటల పాటు కాజీపేట పట్టణ ప్రజలకు అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా ఆర్టీఏ కమిటీ సభ్యుడు కాటపురం రాజు, జిల్లా రైతు సమన్వయ కమిటీ సభ్యుడు సుంచు కృష్ణ, మాజీ కార్పొరేటర్లు రావుల సదానందం, సుంచు అశోక్, బీఆర్ఎస్ నాయకులు బస్వ యాదగిరి, మిట్టపల్లి రవీందర్, బి.రంజిత్ కుమార్, ఎండీ.సోని, పి.శివకుమార్, తేలు సారంగపాణి, నజీరుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమంతో ప్రజల జీవితాల్లో వెలుగులు



చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే, అధికారులు

కరీమాబాద్: రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాల ద్వారా ప్రజల జీవితాల్లో వెలుగులు నిండుతున్నాయని బీఆర్ఎస్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు, వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ అన్నారు. రాష్ట్ర ఆవిర్భావ వేడుకల్లో భాగంగా సంక్షేమ దినోత్సవ సంబరాలను మామునూరు హెచ్‌ఆర్‌ఎస్ గార్డెన్‌లో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా 159 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, 25మందికి రూ.10 లక్షల 47 వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేశారు. అలాగే, 6 యూనిట్ల గొర్రెలు, ముగ్గురికి బీసీ రుణాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రమేష్ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశంలోనే ఆదర్శంగా నిలుస్తున్నాయని కొనియాడారు. వరంగల్ ఎంపీ పసునూరి దయాకర్ మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతికి సీఎం కేసీఆర్ ప్రత్యేక కార్యాచరణ రూపొందించి సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని వివరించారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు, అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, ఈస్ట్‌జోన్ డీసీపీ పుల్లా కరుణాకర్, 43వ డివిజన్ కార్పొరేటర్ ఈదురు అరుణ పాల్గొన్నారు.

'విద్య'ను పకడ్బందీగా అమలుచేయాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

విద్యారణ్యపురి: విద్యాహక్కు చట్టాన్ని ప్రభుత్వం పకడ్బందీగా అమలు చేయాలని ప్రజాతంత్ర విద్యార్థి సమైక్య హనుమకొండ జిల్లా కమిటీ బాధ్యులు కోరారు. ఈమేరకు హనుమకొండ జిల్లా విద్యాశాఖ అధికారి ఎండీ.అబ్దుల్‌హైని శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐఎఫ్‌డీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడ్డం నాగార్జున, రాష్ట్ర గర్ల్స్ విభాగం బాధ్యురాలు మాస్ సావిత్రి మాట్లాడుతూ విద్యాహక్కు చట్టం ప్రకారం కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలల్లో పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు ఫీజులో 25శాతం, జర్నలిస్టుల పిల్లలకు 50శాతం ఫీజు రాయితీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనుమతి లేని పాఠశాలలపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఏఐఎఫ్‌డీఎస్ నాయకులు రామ్‌మోహన్, పిట్టల సాయికుమార్, రవికిరణ్, మోహన్‌సాయి తదితరులు పాల్గొన్నారు.

టెక్స్‌టైల్ పార్కులోని సమస్యలు పరిష్కరించాలి



వినతిపత్రం అందజేస్తున్న వెంకట్రాంరెడ్డి

కరీమాబాద్: కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కులో నెలకొన్న సమస్యలను పరిష్కరించడమే కాకుండా పార్కు ప్రారంభం సందర్భంగా ఇచ్చిన హామీలను కూడా నెరవేర్చాలని కాంగ్రెస్ పరకాల నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఇనగాల వెంకట్రాంరెడ్డి కోరారు. ఈమేరకు వరంగల్ కలెక్టర్ ప్రావీణ్యను శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టెక్స్‌టైల్ పార్కు శంకుస్థాపన సందర్భంగా భూములిచ్చిన ప్రతీ కుటుంబంలో ఒకరికి ఉద్యోగం, ప్లాట్ ఇస్తామని సీఎం కేసీఆర్ హామీ ఇచ్చారని, అది ఇప్పటికీ అమలు కాలేదని విమర్శించారు. కేరళకు చెందిన కిటెక్స్ వస్త్ర పరిశ్రమలో స్థానికులకే ఉద్యోగాలు ఇచ్చే విధంగా ప్రత్యేక చొరవ తీసుకోవాలని కోరారు.

భారత రాజ్యాంగాన్ని కాపాడుకుందాం



సదస్సులో మాట్లాడుతున్న జేబీ.రాజు

నయీంనగర్: భారత రాజ్యాంగాన్ని కాపాడుకుందామని భారత్ బచావో హనుమకొండ, వరంగల్ జిల్లా శాఖల బాధ్యులు సూచించారు. దేశంలో బీజేపీ మతోన్మాదం, ఫాసిస్టు పాలనకు వ్యతిరేకంగా భారత్ బచావో ఇరు జిల్లాల శాఖల ఆధ్వర్యంలో భారత్ బచావో సదస్సును హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో హనుమకొండ జిల్లా బాధ్యుడు సిద్దోజు రామబ్రహ్మం అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన వక్త జేబీ.రాజు మాట్లాడుతూ రాజ్యాంగాన్ని రద్దు చేసి దాని స్థానంలో మనుధర్మ శాస్త్రాన్ని తీసుకురావడానికి కేంద్ర ప్రభుత్వం తెరచాటు ప్రయత్నాలు చేస్తోందని విమర్శించారు. విద్యా పరిరక్షణ వేదిక జాతీయ నాయకుడు రమేష్ పట్నాయక్ మాట్లాడుతూ భారత రాజ్యాంగం పెను ప్రమాదంలో ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. భారత్ బచావో రాష్ట్ర కమిటీ చైర్మన్ జహీరొద్దీన్ అలీఖాన్ మాట్లాడుతూ ముస్లిం, మైనార్టీ హక్కులను కాలరాస్తున్న బీజేపీ ఫాసిస్టు ప్రభుత్వాన్ని ఓడించాలని పిలుపునిచ్చారు. జాతీయ కౌన్సిల్ సభ్యుడు గాదె ఇన్నయ్య మాట్లాడుతూ హిందుత్వ, మతోన్మాదాన్ని ఓడించడానికి అన్ని లౌకిక శక్తులు ఏకం కావాలని కోరారు. సదస్సులో భారత్ బచావో నాయకులు ఎం.వెంగళ్‌రెడ్డి, డి.ప్రవీణ్‌కుమార్, గంటా రామిరెడ్డి, మెట్టు రవీందర్, రిటైర్డ్ ప్రొఫెసర్ కాత్యాయిని విద్మహే, సోమయ్య, సురేందర్, జైసింగ్‌రాథోడ్, ప్రజా సంఘాల బాధ్యులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయిలో రాణించడం అభినందనీయం



క్రీడాకారులకు స్వాగతం పలుకుతున్న తెలంగాణ రాష్ట్ర సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ బాధ్యులు

కాజీపేట రూరల్: వరంగల్ సాఫ్ట్‌బాల్ క్రీడాకారులు జాతీయ స్థాయిలో రాణించడం అభినందనీయమని తెలంగాణ రాష్ట్ర సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ చైర్మన్ డాక్టర్ పి.సాంబశివరావు కొనియాడారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అనంతపూర్‌లో ఈనెల 6, 7, 8వ తేదీల్లో జరిగిన జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ క్రీడాపోటీల్లో పాల్గొని పలు పతకాలు సాధించి అనంతరం రైలులో కాజీపేట జంక్షన్‌కు శుక్రవారం చేరుకున్న క్రీడాకారులకు సాంబశివరావు ఆధ్వర్యంలో పలువురు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కోచ్ విజయ్‌ను జాతీయ స్థాయి క్రీడాకారులు తాబేటి శ్రీకరణ్, అఖిల్, విష్, విరి, విల్లునందన్‌ను అభినందించారు. కార్యక్రమంలో జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి తాబేటి రాజేందర్, జిల్లా ఉపాధ్యక్షుడు పెరుమాండ్ల సాంబమూర్తి, కోచ్ తాబేటి నాగరాజు, ఫిజికల్ డైరెక్టర్ శ్రీధర్, క్రీడాకారులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పొగతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు



డంపింగ్ యార్డును పరిశీలిస్తున్న శ్రీనివాస్, తదితరులు

మడికొండ: డంపింగ్‌యార్డ్ నుంచి వెలువడుతున్న పొగతో స్థానికులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారని కాంగ్రెస్ వర్ధన్నపేట ఇన్‌చార్జ్ నమిండ్ల శ్రీనివాస్ ఆందోళన వ్యక్తం చేశారు. మడికొండ శివారులోని డంపింగ్‌యార్డును శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డంపింగ్ యార్డులోని చెత్తను రీసైక్లింగ్ చేయకుండా తగులబెట్టడంతో భారీగా పొగ వ్యాపిస్తోందని తెలిపారు. వ్యర్థాల నుంచి వచ్చే నీరు.. వడ్డెపల్లి చెరువులో కలుస్తోందని వాపోయారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ తొట్ల రాజుయాదవ్, బైరి లింగమూర్తి, వస్కుల శంకర్, కుర్ల మోహన్, కుక్కల సమ్మయ్య, నీలం వేణు, దువ్వ విజయ్, వస్కుల నాగరాజు, గడుసు రాజు, రఘు, శ్రీకాంత్, రమేష్, సంపత్‌రెడ్డి, రాజు, స్వామి, తిరుపతి, ఉదయ్, వినయ్, నవీన్ పాల్గొన్నారు.

వందఫీట్ల రోడ్డు పనులు పూర్తిచేయాలి

హన్మకొండ: కాకతీయ యూనివర్సిటీ – ఫాతిమానగర్ వంద ఫీట్ల రోడ్డు పనులను త్వరగా పూర్తిచేసి రాకపోకలను పునరుద్ధరించాలని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఏనుగుల రాకేష్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈమేరకు హనుమకొండ ఎన్జీవోస్ కాలనీలోని క్యాంపు కార్యాలయంలో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్‌కు 3వ బహిరంగ లేఖను రాకేష్‌రెడ్డి శుక్రవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా రాకేష్‌రెడ్డి మాట్లాడుతూ ఈ రోడ్డులో నిర్మిస్తున్న డక్ట్ అండ్ డ్రైన్ పనులు నత్తనడకన సాగుతున్నాయని విమర్శించారు. ఆరు నెలల్లో పూర్తి చేస్తామని చెప్పి.. రెండేళ్లవుతున్నా ఇంకా పూర్తి చేయలేదని ఎద్దేవాచేశారు. దాంతో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. రెండేళ్లుగా రోడ్డును మూసివేయడంతో వ్యాపారాలు దెబ్బతిన్నాయని అన్నారు.

బీసీలను గిరిజన జాబితాలో చేర్చొద్దు

హన్మకొండ చౌరస్తా: గిరిజనులను విచ్ఛిన్నం చేసేందుకు 11బీసీ కులాలను గిరిజన జాబితాలో చేర్చేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కుట్రలు చేస్తోందని ఎల్‌హెచ్‌పీఎస్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ జాటోత్ కిషన్ నాయక్ అన్నారు. హనుమకొండ పబ్లిక్‌గార్డెన్‌లో ఎల్‌హెచ్‌పీఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 35లక్షల జనాభా గల 11బీసీ కులాలను ఎస్టీ జాబితాలో చేర్చేందుకు తెలంగాణ ప్రభుత్వం అసెంబ్లీలో చేసిన తీర్మానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. బీసీలను ఎస్టీ జాబితాలో చేర్చడాన్ని నిరసిస్తూ ఈనెల 20వ తేదీన చలో హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద చేపట్టిన ధర్నాకు గిరిజనులు పెద్దసంఖ్యలో తరలిరావాలని కోరారు. నాయకులు రాజేష్, వసంత్, వెంకట్, ప్రవీణ్, పూల్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

పైప్‌లైన్ లీకేజీలతో తాగునీరు వృథా



తిలక్‌రోడ్డులో రోడ్డుపై పారుతున్న తాగునీరు

కాశిబుగ్గ: వరంగల్ కాశిబుగ్గ తిలక్‌రోడ్డులో పైపులైన్ల లీకేజీల కారణంగా గత కొన్ని నెలలుగా గంటల తరబడి తాగునీరు వృథా అవుతోంది. అయినా సంబంధిత అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాశిబుగ్గ మున్సిపల్ సర్కిల్ కార్యాలయానికి కూతవేటు దూరంలో భారీగా తాగునీరు నేలపాలవుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. దాంతో నల్లాల ద్వారా సరిపడా నీరు రావడం లేదని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు వెంటనే స్పందించి లీకేజీలను అరికట్టాలని పలువురు కోరుతున్నారు.

సంక్షిప్తంగా

అంగన్‌వాడీ కేంద్రంలో అక్షరాభ్యాసం

మడికొండ: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మడికొండ అంగన్‌వాడీ –5 సెంటర్‌లో సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మడికొండ ఐసీడీఎస్ సెక్టార్ సూపర్‌వైజర్ రాజ్యలక్ష్మి మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందజేస్తున్న సేవలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు మూల మల్లీశ్వరి, రాజ్యలక్ష్మి, వసంత, లలిత, పసుల వెంకటలక్ష్మి, ఆయా సుభద్ర, పిల్లలు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ కోర్సుతో ఉద్యోగ అవకాశాలు

కాశిబుగ్గ: పాలిటెక్నిక్ కోర్సు చేసిన వారికి ఉద్యోగ అవకాశాలు ఎక్కువగా ఉంటాయని ప్రీమియం చిక్స్, ఫీడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఏజీఎం, ఎల్‌బీ కళాశాల అలుమ్నీ మెంబర్ అహ్మద్ మొహియొద్దీన్ అన్నారు. ఎల్‌బీ కళాశాల పాలిటెక్నిక్ విభాగంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రాజేందర్‌రెడ్డి అధ్యక్షతన పాలిటెక్నిక్ డేను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పాలిటెక్నిక్ రంగం గురించి విద్యార్థులకు అహ్మద్ వివరించారు. అనంతరం ప్రీమియం చిక్స్, ఫీడ్స్ కంపెనీ, పాలిటెక్నిక్ డిపార్ట్‌మెంట్ మధ్య ఎంఓయూ కుదిరింది. ఈ సందర్భంగా కళాశాలలో నిర్వహించిన క్యాంపస్ ప్లేస్‌మెంట్‌లో 20మంది ఎంపికైనట్లు కళాశాల పాలిటెక్నిక్ విభాగాధిపతి విజయ్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ రాఘువేందర్ రెడ్డి, రాధిక, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమం చూసి పార్టీలో చేరిక

హసన్‌పర్తి: రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి పలు పార్టీలకు చెందిన కార్యకర్తలు బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నారని వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ అన్నారు. నగరంలోని 2వ డివిజన్ గుండ్లసింగారానికి చెందిన పలు పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్‌లో శుక్రవారం చేరారు. ఈ సందర్భంగా వారిని పార్టీలోకి ఎమ్మెల్యే ఆహ్వానించారు. మాజీ కార్పొరేటర్ బానోతు కల్పన ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పర్వతగిరి జెడ్పీటీసీ సభ్యుడు సింగులాల్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ గనిపాక విజయ్, ఆత్మ డైరెక్టర్ కల్పన, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు నరేడ్ల శ్రీధర్, సూదన్‌పల్లి సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

మహిళా ప్రాంగణంలో కల్చరల్ ప్రోగ్రాం

మడికొండ: తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మడికొండ శివారులోని దుర్గాబాయి మహిళా శిశు వికాస కేంద్రంలో శుక్రవారం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. సెల్ఫ్ డిఫెన్స్, హెల్త్ అవేర్‌నెస్ కార్యక్రమాలను శిక్షణ విద్యార్థులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా జిల్లా మేనేజర్ జయశ్రీ మాట్లాడుతూ సెల్ఫ్ డిఫెన్స్ ద్వారా శారీరక దృఢత్వం, మానసిక ఆరోగ్యంగా కలుగుతాయని చెప్పారు. కార్యక్రమంలో సిబ్బంది హేమరాణి, కృష్ణవేణి, కళ్యాణ్, ప్రత్యూష, కస్తూరి, పుష్ప, శైలజ, మధు, యాదగిరి, సోని, మమత పాల్గొన్నారు.

రాధాకృష్ణుల ఆలయ వార్షికోత్సవం

కాజీపేట: కాజీపేట మండలం సోమిడి గ్రామంలోని రాధాకృష్ణుల దేవాలయ 9వ వార్షికోత్సవాన్ని మాజీ డీసీసీబీ చైర్మన్ జంగా రాఘవరెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ఆలయ ప్రధాన పూజారి అయిన వోలు సాయికృష్ణశర్మ ఆధ్వర్యంలో రాధాకృష్ణుల విగ్రహాలకు అర్చనలు, అభిషేకాలతో పాటు ప్రత్యేక అలంకరణ పూజలు జరిపించారు. భక్తులకు స్థానిక కార్పొరేటర్ జక్కుల రవిందర్‌యాదవ్ – రమ దంపతులు మహాన్నదానం చేశారు. కార్యక్రమంలో తొట్ల రాజు యాదవ్, బోయిని కుమార్‌యాదవ్, మెరుగు రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

33 మంది విద్యార్థులకు ఉద్యోగాలు

హసన్‌పర్తి: ఎస్‌వీఎస్ విద్యాసంస్థల్లోని వివిధ విభాగాలకు చెందిన 33 మంది విద్యార్థులు ఉద్యోగాలు సాధించారని ఎస్‌వీఎస్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఎర్రబెల్లి తిరుమల్‌రావు తెలిపారు. భీమారంలోని ఎస్‌వీఎస్ కళాశాలలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని రెండు రోజుల క్రితం కళాశాలలో జాబ్‌మేళా నిర్వహించినట్లు చెప్పారు.

కళా సిల్క్ చేనేత, హస్తకళా ప్రదర్శన

హన్మకొండ అర్బన్: నగరంలోని ఆర్‌ఈసీ పెట్రోల్ పంప్ సమీపంలోని తారా గార్డెన్స్‌లో కళా సిల్క్ చేనేత, హస్తకళా ప్రదర్శనను ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్, కార్పొరేటర్ ఏనుగుల మానస శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ నమ్మకమైన ధరలతో నాణ్యమైన వస్త్రాలు ప్రజలకు అందిస్తున్నట్లు తెలిపారు. 65శాతం వరకు డిస్కౌంట్‌తో మొదటిసారిగా హనుమకొండలో కళాసిల్క్ చేనేత, హస్తకళా ప్రదర్శన, అమ్మకాలు ఏర్పాటు చేసినట్లు వివరించారు. ప్రదర్శనలో పట్టు, ఫ్యాన్సీ, డిజైనర్, చేనేత చీరలు, డ్రెస్ మెటీరియల్స్, చుడీదార్స్, సూటింగ్స్, షర్టింగ్స్ అందుబాటులో ఉంటాయని చెప్పారు. వారం రోజుల పాటు జరగనున్న ఈ ప్రదర్శన, అమ్మకాలను నగర ప్రజలు సద్వినియోగం చేసుకొని కొనుగోళ్లు చేయాలని కోరారు.

అనాథలు, వీధి బాలలకు పండ్ల పంపిణీ

కాశిబుగ్గ: టీపీసీసీ కార్యదర్శి మీసాల ప్రకాశ్ జన్మదిన వేడుకలను కాంగ్రెస్ పార్టీ నాయకులు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కాశిబుగ్గలోని మదర్‌థెరిస్సా అనాథ ఆశ్రమం, శివనగర్‌లోని డాన్‌బాస్కో నవజీవన్ వీధి బాలల పాఠశాలలో కేక్ కట్ చేసి పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో కాంగ్రెస్ నాయకులు సందెల లాజర్, కూచన రవిందర్, జంగం ప్రభాకర్, గూడ గోవర్ధన్, నర్మెట చిన్నా, కొండమీది సదానందం, కోకిల యాకుబ్, శ్రీధర్, శారద, రజిత, జహీరా, విజయ పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ

కాశిబుగ్గ: వరంగల్ కాశిబుగ్గలో లక్ష్మీగణపతి సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని వరంగల్ అర్బన్ కో ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్, బీజేపీ నేత ఎర్రబెల్లి ప్రదీప్‌రావు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా బాటసారులకు మంతెన అమరీష్ మజ్జిగ పంపిణీ చేశారు.

ఓసిటీలో ఇంటి నిర్మాణం కూల్చివేత

కాశిబుగ్గ: వరంగల్ 19వ డివిజన్ ఓ సిటీలోని తన స్థలంలో ఇంటి నిర్మాణం చేస్తుండగా గురువారం కొందరు వ్యక్తులు వచ్చి కూల్చివేశారని బాధితుడు జేసు శ్రీనాథ్ వాపోయాడు. ఈమేరకు మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం నగరంలోని లేబర్‌కాలనీ గొర్రెకుంట క్రాస్‌రోడ్డులో నివాసం ఉంటున్న శ్రీనాథ్.. 2013లో వేలంపాటలో ఓ సిటీలో 200 గజాల స్థలాన్ని కొనుగోలు చేశాడు. ఈక్రమంలో ఇటీవల అనుమతి తీసుకుని ఇంటి నిర్మాణం చేస్తుండగా వెంకటలక్ష్మి అనే మహిళ.. కొంతమందిని వెంటబెట్టుకుని వచ్చి ఆ స్థలం తనదని ఇక్కడ నిర్మాణం చేయొద్దంటూ ఇంటి నిర్మాణాన్ని కూల్చివేసింది.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

కాశిబుగ్గ: గుర్తు తెలియని రైలు ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన వరంగల్ – చింతలపల్లి రైల్వే స్టేషన్ల మధ్య గొర్రెకుంట క్రాస్ రోడ్డు సమీపంలో శుక్రవారం ఉదయం చోటుచేసుకుంది. జీఆర్పీ సీఐ నరేష్ తెలిపిన వివరాల ప్రకారం ఉత్తరప్రదేశ్ రాష్ట్రం విష్ణుపూర్‌కు చెందిన సోను(25) గొర్రెకుంటలోని కరాణి కారం మిల్లులో కార్మికుడిగా పనిచేస్తున్నాడు. ఈక్రమంలో జాన్‌పీరీలు, గొర్రెకుంట క్రాస్‌రోడ్డు సమీపంలో శుక్రవారం ఉదయం రైలు పట్టాలు దాటుతుండగా ప్రమాదవశాత్తు గుర్తు తెలియని రైలు ఢీకొట్టి మృతి చెందాడు.

కరీమాబాద్‌లో బడిబాట



కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఉపాధ్యాయులు

కరీమాబాద్: జయశంకర్ బడి బాట కార్యక్రమంలో భాగంగా కరీమాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు డాక్టర్ దుర్గం రవి ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు శుక్రవారం ఇల్లిల్లు తిరుగుతూ బడీడు పిల్లలను బడిలో చేర్పించాలని వారి తల్లిదండ్రులను కోరారు. విద్య ప్రాముఖ్యతను వివరించారు. కురుమవాడ, శివాలయం ప్రాంతాల్లో పర్యటించి ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో బోధన ఉంటోందని తెలిపారు. ఈక్రమంలోనే 10 మంది విద్యార్థులకు అడ్మిషన్లు కల్పించారు.